

వెయ్యి కి.మీ. రేంజ్ మిస్సైళ్లు... శిక్షణ కోసం భారత్ వైపు జపాన్ చూపు

నిప్పులాంటి నిజాల ప్రతిబింబం

నిలువుటద్దం

విలేకరులు కావలెను...

సంచలన దినపత్రిక నిలువుటద్దం కు – తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా జిల్లాల వారీగా, మండలాల వారీగా పనిచేయుటకు రిపోర్టర్లు కావలెను.

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ 9059548848

హైదరాబాద్. | ఎడిటర్:- వై. రమ నాగరాజు | సంపుటి:-32 | సంచిక:-238 | గురువారం 29-10-2026

తుపాను వేళ ఏపీకి అండగా తెలంగాణ ప్రభుత్వం..

సాయానికి సిద్ధమన్న భట్టి

- ఉత్తరాంధ్రను అతలాకుతలం చేసిన అర్నబ్ తుపాను
- విపత్తులో ఏపీకి సాయం చేసేందుకు ముందుకొచ్చిన తెలంగాణ ప్రభుత్వం
- ఏపీ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు ఫోన్ చేసిన తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- విద్యుత్ పునరుద్ధరణ పనులకు సిబ్బంది, సామగ్రి పంపుతామని హామీ
- తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన మంత్రి గొట్టిపాటి
- ఇప్పటికే సహాయక చర్యల కోసం 6,000 మంది సిబ్బందిని మోహరించిన ఏపీ ప్రభుత్వం

2లో

అర్నబ్ తుపాను కారణంగా తీవ్రంగా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌కు సహాయం అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం ముందుకొచ్చింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం, ఏపీలో తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలకు, ముఖ్యంగా విద్యుత్ పునరుద్ధరణ పనులకు తమ వంతు సహకారం అందిస్తామని ప్రకటించింది. ఈ మేరకు తెలంగాణ ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క బుధవారం ఆంధ్రప్రదేశ్ ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌తో ఫోన్‌లో మాట్లాడారు. తుపాను తీవ్రత, ఏపీలో జరిగిన నష్టం గురించి భట్టి విక్రమార్క ఆరా తీశారు. ముఖ్యమంత్రి

తెలంగాణలో 'ఏఐ సాక్షమ్' కార్యక్రమం ప్రారంభం

- 'ఏఐ సాక్షమ్' కార్యక్రమాన్ని ప్రారంభించిన మల్లు భట్టి విక్రమార్క
- రైతులు, పింఛనుదారులు కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి మారాలన్న డిప్యూటీ సీఎం
- ప్రజల డేటా భద్రతకే అత్యధిక ప్రాధాన్యమని వెల్లడి

తెలంగాణలో ప్రభుత్వ సేవలను మరింత - మిగతా 2 లో

రాష్ట్రంలో ఎమర్జెన్సీ పాలన నడుస్తోంది

➢ కాంగ్రెస్ సర్కార్‌పై హరీశ్ రావు ధ్వజం

- మూసీ ప్రాజెక్టుపై ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లకుండా బీఆర్ఎస్ నేతలను దిగ్బంధించారన్న హరీశ్
- కరవుతో అల్లాడుతున్న రైతులను ఆదుకోవడం చేతకాని ప్రభుత్వమని విమర్శ
- ప్రతిపక్షాల గొంతును ఎంతకాలం అణచివేస్తారని ప్రశ్న

కేటీఆర్ పాస్‌పోర్ట్ వివాదం యథాతథ స్థితి కొనసాగించాలన్న హైకోర్టు

- ఫార్ములా ఈ కేసులో కేటీఆర్‌కు తాత్కాలిక ఊరట
- ఏసీబీ, పాస్‌పోర్ట్ అధికారులకు కోర్టు నోటీసుల జారీ
- కేసు తదుపరి విచారణ నవంబర్ 6కు వాయిదా

ఫార్ములా ఈ రేస్ నిధుల మళ్లింపు కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీ రామారావుకు తెలంగాణ హైకోర్టులో తాత్కాలిక ఊరట లభించింది.

పులివెందులలో వైసీపీకి ఎదురుదెబ్బ టీడీపీలోకి 20 కుటుంబాలు



- పులివెందులలో వైసీపీకి షాక్
- టీడీపీలో చేరిన 20 వైసీపీ కుటుంబాలు
- పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన బీటెక్ రవి

స్థానిక ఎన్నికలకు కొన్ని రోజుల ముందు వైసీపీకి షాక్ తగిలింది. వైసీపీ అధినేత - మిగతా 2 లో

టాటా గ్రూప్‌ను నాశనం చేస్తున్నారు

మోదీ, అమిత్ షాలపై రాహుల్ గాంధీ ఫైర్

- టాటా గ్రూప్‌ను నేరపూరితంగా నాశనం చేస్తున్నారన్న రాహుల్ గాంధీ
- మోదీ, అమిత్ షాలపై తీవ్ర విమర్శలు
- భయంతోనే వ్యాపారవేత్తలు మౌనంగా ఉన్నారని ఆరోపణ

లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ టాటా గ్రూప్‌పై సంచలన ఆరోపణలు చేశారు. - మిగతా 2 లో

బ్యాలెట్ పేపర్లతో ఎన్నికలు కాంగ్రెస్ ఖాతా తెరిచిందా?

- నాలుగు రాష్ట్రాల్లో 28 ఎమ్మెల్సీ స్థానాలకు ఉపఎన్నికలు
- 12 స్థానాల్లో పోటీ చేసిన కాంగ్రెస్
- కాంగ్రెస్‌కు ఒక్క సీటు కూడా దక్కని వైనం
- ఎన్నికలు బ్యాలెట్ పత్రాలతో జరిగాయని గుర్తుచేసిన ప్రధాని మోదీ
- మోనోకిల్ ఎమోజీతో కాంగ్రెస్‌పై మోదీ సెటైర్

నాలుగు రాష్ట్రాల్లో జరిగిన ఎమ్మెల్సీ

గ్రావిటీతో నీళ్లిస్తే రాజీనామా చేస్తా: ప్రభుత్వానికి హరీశ్‌రావు సవాల్

పదవికి రాజీనామా చేస్తానని, ఒకవేళ నిరూపించలేకపోతే నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రాజీనామా చేస్తారా? అని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు కాంగ్రెస్ ప్రభుత్వానికి బహిరంగ సవాల్ విసిరారు. గ్రావిటీతో నీళ్లు వస్తాయని ప్రభుత్వం అబద్ధాలు చెబుతోందని ఆయన మండిపడ్డారు. రాష్ట్రంలో నెలకొన్న కరవుకు ప్రభుత్వ వైఫల్యమే కారణమని హరీశ్ ఆరోపించారు. "ఇది కాలం తెచ్చిన కరవు కాదు. కాంగ్రెస్ తెచ్చిన కరవు" అని ఆయన వ్యాఖ్యానించారు. కృష్ణా, గోదావరిలో నీరు అందుబాటులో ఉన్నా ఎత్తిపోతలు చేపట్టకుండా ప్రభుత్వం రైతులను నష్టపరుస్తోందని విమర్శించారు. 33 శాతం వర్షపాతం లోటు ఉన్న ఏపీలో లేని క్రాప్ హాలిడే, కేవలం 17 శాతం లోటు ఉన్న తెలంగాణలో ఎందుకు ప్రకటించారని ప్రశ్నించారు. ప్రభుత్వం తక్షణమే మేడిగడ్డ బ్యారేజీకి మరమ్మతులు చేపట్టి, కన్నెపల్లి పంపుహౌస్ నుంచి నీటిని ఎత్తిపోయాలని డిమాండ్ చేశారు. తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టు నిర్మాణానికి రూ.25 వేల కోట్లు ఖర్చు చేస్తామంటున్నారని, అసలు ఆ ప్రతిపాదనకు సంబంధించిన డీపీఆర్‌ను ఎందుకు బహిర్గతం చేయడం లేదని నిలదీశారు. తుమ్మిడిహెట్టి వద్ద తగినంత నీటి లభ్యత లేదని కేంద్ర జల సంఘం స్పష్టం చేసిన తర్వాతే, తమ ప్రభుత్వం మేడిగడ్డ వద్ద కాళేశ్వరం ప్రాజెక్టును చేపట్టిందని ఆయన గుర్తుచేశారు.

రాష్ట్రం పిచ్చోడి చేతిలో రాయిలా మారింది

విమర్శలు గుప్పించారు. గోదావరిలో నీళ్లు అందుబాటులో ఉన్నప్పటికీ, వాటిని ఎత్తిపోయకుండా ఉద్దేశపూర్వకంగానే రాష్ట్రంలో కరవు పరిస్థితులను సృష్టిస్తున్నారని ఆయన ఆరోపించారు. ప్రభుత్వం రైతులను వరి వేయవద్దని చెప్పడాన్ని తప్పుబట్టారు. "రాష్ట్రం ప్రస్తుతం పిచ్చోడి చేతిలో రాయిలా మారింది. ఏ ఒక్క వర్గానికీ న్యాయం చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైంది" అని కేటీఆర్ మండిపడ్డారు. రోమ్ నగరం తగలబడుతుంటే చక్రవర్తి ఫిడేల్ వాయించినట్టుగా, రాష్ట్రంలో కరవు ఉంటే ప్రభుత్వం మూసీ సుందరీకరణ పనులకు టెండర్లు పిలుస్తోందని ఎద్దేవా చేశారు. మరో ఏడాదిన్నరలో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని, ప్రజలు ఓపిక పట్టాలని కోరారు. అయితే కేటీఆర్ ఆరోపణలను కాంగ్రెస్ నేతలు ఖండించారు. కేటీఆర్ వి దొంగ కన్నీళ్లని, గోదావరి జలాలను వృథా చేయడం లేదని, ఇతర ఎత్తిపోతల పథకాల ద్వారా వినియోగిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం కాళేశ్వరం ప్రాజెక్టు వద్ద నీటిమట్టం తక్కువగా ఉన్నందున పంపులను నడపడం సాధ్యం కాదని వారు స్పష్టం చేశారు.

'బ్రేకింగ్ బ్యాడ్' తర్వాత ఇప్పుడు 'ప్రిజన్ బ్రేక్'

విరుచుకుపడ్డారు. ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని ప్రభుత్వంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని ఆరోపిస్తూ, ప్రముఖ వెబ్ సిరీస్‌ల పేర్లతో విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో 'బ్రేకింగ్ బ్యాడ్' తర్వాత ఇప్పుడు 'ప్రిజన్ బ్రేక్' మొదలైందని ఆయన ఎద్దేవా చేశారు. తేని జిల్లాలోని తెక్కంపట్టి సబ్ జైలు నుంచి నిన్న రాత్రి 17 మంది విచారణ ఖైదీలు పరారైన ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ నేపథ్యంలో స్పందించిన స్టాలిన్... సీఎం విజయ్ పరిపాలన వైఫల్యంపై విమర్శలు చేశారు. "బ్రేకింగ్ బ్యాడ్ తర్వాత ఇప్పుడు తమిళనాడులో ప్రిజన్ బ్రేక్ కూడా మొదలైంది. బెయిల్‌పై బయటకు వచ్చిన వారినే పర్యవేక్షించడం లేదనుకున్నా. కానీ ఈ చేతకాని ప్రభుత్వ హయాంలో జైళ్లలో ఉన్న ఖైదీలు కూడా సులభంగా తప్పించుకుంటున్నారు" అని ఆయన వ్యాఖ్యానించారు. 1995 తర్వాత ఇంత పెద్ద సంఖ్యలో ఖైదీలు తప్పించుకోవడం ఇదే మొదటిసారని స్టాలిన్ గుర్తుచేశారు. ఈ ప్రభుత్వం ప్రజలను రక్షించలేదని, ప్రజలకు స్వీయరక్షణే శరణ్యమని ఆయన అన్నారు. ఇటీవల టీవీకే పార్టీ నేత ఒకరు నార్కోటిక్స్ కేసులో పట్టుబడినప్పుడు స్టాలిన్ ఆ పార్టీని 'బ్రేకింగ్ బ్యాడ్ పార్టీ' అని విమర్శించిన విషయం తెలిసిందే. తేని జైలు ఘటనలో, ఓ ఖైదీకి మూర్ఛ వచ్చిందని నమ్మించిన ఖైదీలు, సెల్‌లోకి వచ్చిన గార్డులపై దాడి చేసి పరారయ్యారు. ఈ ఘటన తర్వాత అప్రమత్తమైన పోలీసులు, పరారైన వారిని పట్టుకోవడానికి 17 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు నలుగురు ఖైదీలను తిరిగి అరెస్ట్ చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనకు బాధ్యులుగా తొమ్మిది మంది జైలు సిబ్బందిని సస్పెండ్ చేశారు. ముఖ్యమంత్రి విజయ్ వద్దే హోం శాఖ ఉండటంతో, విపక్షాల విమర్శలకు ఆయన నేరుగా సమాధానం చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడింది.

కాకినాడకు 167 కి.మీ. దూరంలో 'అర్ణబ్ అధికారులకు చంద్రబాబు దిశానిర్దేశం

ఆరు గంటలుగా గంటకు 23 కిలోమీటర్ల వేగంతో తీరం వైపు దూసుకొస్తోందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ సందర్భంగా వివిధ జిల్లాలపై తుపాను ప్రభావం, భారీ వర్షాల హెచ్చరికల గురించి సీఎం వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమీక్ష అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు తుఫాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడటమే ప్రథమ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో బాధితులకు అవసరమైన ఆహారం, తాగునీరు, ఇతర సౌకర్యాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. తుపాను ప్రభావంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగితే యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించాలని, ఈదురు గాలులకు చెట్లు, హోర్డింగులు కూలిపోతే తక్షణమే తొలగించి రవాణాకు ఆటంకాలు లేకుండా చూడాలని సీఎం ఆదేశించారు. సహాయక చర్యల కోసం సిద్ధంగా ఉన్న ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బలగాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. జిల్లాల్లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ల ద్వారా క్షేత్రస్థాయి పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, తక్షణమే స్పందించాలని కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

పులివెందులలో వైసీపీకి ఎదురుదెబ్బ టీడీపీలోకి 20 కుటుంబాలు

మొదటిపేజీ తరువాయి - జగన్ సొంత గడ్డ పులివెందులకు చెందిన 20 వైసీపీ కుటుంబాలు ఈరోజు తెలుగుదేశం పార్టీలో చేరాయి. పులివెందుల టీడీపీ ఇన్‌ఛార్జ్ బీటెక్ రవి వారికి పసుపు కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా బీటెక్ రవి మాట్లాడుతూ... టీడీపీ విధానాలు, కార్యక్రమాలకు ఆకర్షితులై నియోజకవర్గంలో పెద్ద సంఖ్యలో యువత పార్టీలో చేరుతున్నారని అన్నారు. ఎన్నికలకు కేవలం కొన్ని రోజుల సమయం మాత్రమే ఉన్నప్పటికీ, పులివెందులలోని ప్రతి వార్డులో ప్రజలు టీడీపీ వైపు మొగ్గు చూపుతున్నారని, మద్దతుదారుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోందని పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో టీడీపీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ అభ్యర్థిగా బరిలో ఉన్న గీతా కుమారి భారీ మెజారిటీతో గెలుపొందడం ఖాయమని బీటెక్ రవి ధీమా వ్యక్తం చేశారు. కీలకమైన ఎన్నికల సమయంలో ఈ చేరికలు జరగడం నియోజకవర్గంలో రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.

బ్యాలెట్ పేపర్లతో ఎన్నికలు.. కాంగ్రెస్ ఖాతా తెరిచిందా?

మొదటిపేజీ తరువాయి - ఉపఎన్నికల్లో కాంగ్రెస్ ఒక్క స్థానాన్నీ గెలుచుకోలేకపోయింది. ఈ ఫలితాలపై ప్రధాని నరేంద్ర మోదీ వ్యంగ్యంగా స్పందించారు. బ్యాలెట్ పత్రాలతో ఎన్నికలు జరిగాయని గుర్తుచేస్తూ, కాంగ్రెస్ ఎన్ని స్థానాలు గెలిచిందో ఊహించాలంటూ ఎక్స్‌లో పోస్టు చేశారు. దీనికి 'మోనోకిల్' ఎమోజీని జతచేశారు. ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, బిహార్, కర్ణాటక రాష్ట్రాల్లో మొత్తం 28 ఎమ్మెల్సీ స్థానాలకు ఉపఎన్నికలు జరిగాయి. కాంగ్రెస్ 12 స్థానాల్లో పోటీ చేసింది. గతంలో ఆ పార్టీ గెలిచిన నాలుగు స్థానాలు కూడా ఈ ఎన్నికల్లో ఉన్నాయి. అయినా ఈసారి ఒక్క చోటా విజయం సాధించలేకపోయింది. కర్ణాటకలో అధికారంలో ఉన్నప్పటికీ కాంగ్రెస్‌కు సీటు దక్కకపోవడం గట్టి ఎదురుదెబ్బగా మారింది. ఈ ఫలితాలను ప్రస్తావిస్తూ మోదీ కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు. ఓటింగ్ యంత్రాల్లో అక్రమాలు జరుగుతున్నాయంటూ కాంగ్రెస్ గతంలో ఆరోపణలు చేసింది. బ్యాలెట్ పత్రాలతో ఎన్నికలు నిర్వహించాలని కూడా కోరింది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీ ఎన్నికలు బ్యాలెట్ పత్రాలతోనే జరిగాయని మోదీ గుర్తుచేశారు. అయినా కాంగ్రెస్‌కు ఒక్క సీటు కూడా రాలేదంటూ పరోక్షంగా ఎద్దేవా చేశారు.

టాటా గ్రూప్‌ను నాశనం చేస్తున్నారు

మొదటిపేజీ తరువాయి - టాటా సంస్థను 'నేరపూరితంగా నాశనం' చేస్తున్నారని, అయినా దేశంలోని వ్యాపారవేత్తలు భయంతో నోరు మెదపడం లేదని ఆయన తీవ్రస్థాయిలో విమర్శించారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా ఆయన ఒక పోస్ట్ చేశారు. "భారతీయ వ్యాపార రంగం మోదీ, అమిత్ షాల ఆటవస్తువు కాదు. మీకు ధైర్యం లేదు, మాకుంది. ఈ నేరాలకు న్యాయం జరిగేలా చూస్తాం" అని రాహుల్ తన పోస్టులో పేర్కొన్నారు. టాటా గ్రూప్‌లో కొంతకాలంగా నడుస్తున్న అంతర్గత వివాదం నేపథ్యంలో రాహుల్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. టాటా సన్స్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా ఎన్. చంద్రశేఖరన్ పునర్‌నియామకాన్ని టాటా ట్రస్ట్స్ ఛైర్మన్ నోయెల్ టాటా సవాలు చేశారు. సెప్టెంబర్ 17న జరిగిన బోర్డు తీర్మానం చెల్లదని, నియామక ప్రక్రియలో నిబంధనలు పాటించలేదని ఆయన అక్టోబర్ 26న రాసిన లేఖలో ఆరోపించారు. ఈ వివాదం కార్పొరేట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మరోవైపు, రాహుల్ ఆరోపణలపై బీజేపీ నేత సీఆర్ కేశవన్ స్పందించారు. రాహుల్ గాంధీకి ఆర్థికశాస్త్రంపై అవగాహన లేదని విమర్శించారు.

బంగాళాఖాతంలో వాయుగుండం , వేగంతో కదులుతున్న 'అర్నబ్'

మొదటిపేజీ తరువాయి - భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. బుధవారం బాపట్ల--విశాఖ తీరాల మధ్య తుపాను తీరం దాటే సూచనలు ఉన్నాయని ఆ సమయంలో బలమైన ఈదురుగాలులు వీచే ప్రమాదం ఉందని హెచ్చరించారు.ప్రభావిత జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, క్షేత్రస్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలని ప్రమాదకరంగా ఉన్న హోర్డింగులను వెంటనే తొలగించాలని ఆదేశించారు. అవసరమైతే తీరప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేయాలని, సహాయక చర్యల కోసం ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచాలని స్పష్టం చేశారు. మత్స్యకారులు వేటకు వెళ్లరాదని, బీచ్‌లలోకి పర్యాటకులను అనుమతించవద్దని సూచించారు. రైతులు, ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మవద్దని, వ్యాప్తి చేయవద్దని తెలిపారు.12 జిల్లాలపై ప్రభావం: అర్నబ్ తీవ్ర తుపాను

కారణంగా 12 జిల్లాల్లో అత్యంత భారీవర్షాలు కురవనున్నట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఇది ఈ నెల 28 నాటికి తీవ్ర ప్రభావం చూపనున్నట్లు వెల్లడించారు. మరోవైపు తుపాను ప్రభావంపై ఏపీఈపీడీసీఎల్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ అధికారులను ఆదేశించారు. తుపాను ప్రభావంతో ఈ నెల 27, 28 తేదీల్లో విశాఖ, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కాకినాడ, తూర్పుగోదావరి, అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరు, బాపట్ల, గుంటూరు, ఎన్టీఆర్, కృష్ణా, పార్వతీపురం మన్యం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలో అతి భారీ వర్షాలు, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో భారీ వర్షాలు కురవనున్నాయి. ఈ నెల 29 నాటికి తుపాను తీవ్రత కాస్త తగ్గనుంది. ఆ రోజు ఏలూరు, పశ్చిమగోదావరి, అల్లూరి, విశాఖ, అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.మరోవైపు అత్యవసర పరిస్థితులనైనా సమర్థంగా ఎదుర్కొనేందుకు అప్రమత్తంగా ఉండాలని ఏపీఈపీడీసీఎల్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీతేజ్ అధికారులను ఆదేశించారు. తుపాను పరిస్థితులపై టెలికాన్ఫరెన్స్ ద్వారా 12 జిల్లాల సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజినీర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, ఇతర సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

తుపాను వేళ ఏపీకి అండగా తెలంగాణ ప్రభుత్వం.. సాయానికి సిద్ధమన్న భట్టి

మొదటిపేజీ తరువాయి - చంద్రబాబు సారథ్యంలో నష్టాన్ని తగ్గించడానికి, వీలైనంత త్వరగా పరిస్థితులను సాధారణ స్థితికి తీసుకురావడానికి చేపడుతున్న చర్యలను మంత్రి గొట్టిపాటి ఆయనకు వివరించారు. ముఖ్యంగా విద్యుత్ సరఫరా పునరుద్ధరణ, ప్రజల భద్రత కోసం తీసుకుంటున్న ప్రత్యేక చర్యల గురించి తెలిపారు. ఈ కష్టకాలంలో ఆంధ్రప్రదేశ్‌కు తెలంగాణ ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. విద్యుత్ పునరుద్ధరణ పనుల కోసం అవసరమైతే సిబ్బందిని, అవసరమైన సామగ్రిని పంపడానికి తాము సిద్ధంగా ఉన్నామని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ ప్రభుత్వ హామీతో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు మరింత వేగవంతం అవుతాయని భావిస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం అందించిన సహాయ హస్తానికి మంత్రి గొట్టిపాటి రవికుమార్ కృతజ్ఞతలు తెలిపారు. కష్టకాలంలో అండగా నిలుస్తామన్న భట్టి విక్రమార్కకు, తెలంగాణ ప్రభుత్వానికి ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. తెలుగు రాష్ట్రాల మధ్య ఈ సహకారం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. అంతకుముందు, తుపాను సహాయక చర్యల కోసం ఏపీ ప్రభుత్వం ఇప్పటికే సుమారు 6,000 మంది అనుభవజ్ఞులైన సిబ్బందిని రంగంలోకి దించినట్లు గొట్టిపాటి తెలిపారు. తుఫాను పునరుద్ధరణ పనుల్లో అనుభవం ఉన్న అధికారులు, ఫీల్డ్ సిబ్బందిని అత్యవసర సేవల కోసం సిద్ధం చేశామన్నారు. విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ జిల్లాల్లో డైరెక్టర్ల స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారని ఆయన వివరించారు.

'రోబోను పెట్టుకో, మనిషిని తీసెయ్'

మొదటిపేజీ తరువాయి - స్థానంలో రోబోలను నియమించుకోవడానికి మొగ్గు చూపుతున్నాయని మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకులు బిల్ గేట్స్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన ఈ వ్యాఖ్యలు చేసిన కొద్ది గంటల్లోనే, మైక్రోసాఫ్ట్ సంస్థ సుమారు 60,000 మంది ఉద్యోగులకు స్వచ్ఛంద పదవీ విరమణ (వాలంటరీ ఎగ్జిట్) ఆఫర్‌ను ప్రకటించడం టెక్ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. 'ది అబ్జర్వర్'కు ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో బిల్ గేట్స్ మాట్లాడుతూ, ఏఐ యుగాన్ని ఒక చారిత్రక పరిణామంగా అభివర్ణించారు. భూమిపై మనుషులే అత్యంత తెలివైన జీవులు అనే భావన ఇకపై చెల్లదని ఆయన వ్యాఖ్యానించారు. తొలుత వైట్ కాలర్ ఉద్యోగాలను, ఆ తర్వాత హ్యూమనాయిడ్ రోబోల ద్వారా శారీరక శ్రమతో కూడిన పనులను కూడా ఏఐ స్వాధీనం చేసుకుంటుందని ఆయన జోస్యం చెప్పారు. "రోబోను నియమించుకుని, మనిషిని తొలగించి, వెనక్కి తిరిగి చూడొద్దు" అనే ధోరణి వ్యాపార రంగంలో ప్రస్తుతం ప్రబలంగా ఉందని ఆయన విశ్లేషించారు. ఉద్యోగుల సంఖ్య తగ్గితే, ప్రభుత్వాలకు పన్నుల రూపంలో వచ్చే ఆదాయం తగ్గిపోతుందని, ఇది సామాజిక భద్రతా పథకాలపై తీవ్ర ప్రభావం చూపుతుందని గేట్స్ హెచ్చరించారు. ఈ సమస్యను అధిగమించేందుకు ఏఐ వాడకంపై 'టోకెన్ ట్యాక్స్' విధించాలని, అలాగే తనలాంటి బిలియనీర్లపై పన్నులు పెంచాలని సూచించారు. తాను తన జీవితకాలంలో 14 బిలియన్ డాలర్ల పన్నులు చెల్లించానని, అవసరమైతే 40 బిలియన్ డాలర్లు చెల్లించడానికి కూడా సిద్ధంగా ఉన్నానని ఆయన పేర్కొన్నారు. బిల్ గేట్స్ ఇంటర్వ్యూ ప్రచురితమైన మరుసటి రోజే మైక్రోసాఫ్ట్ ఈ వాలంటరీ ఎగ్జిట్ ఆఫర్‌ను ప్రకటించడం గమనార్హం. అమెరికా, కెనడా, యూకే, భారత్‌లోని అర్హత కలిగిన బృందాలలో లెవెల్ 70, అంతకంటే తక్కువ స్థాయిలో ఉన్న ఉద్యోగులకు ఈ ఆఫర్ వర్తిస్తుంది. ఇది కంపెనీ మొత్తం వర్క్‌ఫోర్స్‌లో దాదాపు నాలుగో వంతు. అయితే, అన్ని బృందాలకూ ఇది వర్తించదు. ఈ ఆఫర్‌ను అంగీకరించిన ఉద్యోగులకు వారి సర్వీసు ఆధారంగా సెవరెన్స్ ప్యాకేజీ, కొంతకాలం పాటు స్టాక్ వెస్టింగ్, పరిమిత ఆరోగ్య బీమా, కొత్త ఉద్యోగం వెతుక్కోవడానికి సహాయం వంటివి అందిస్తారు. దీనిపై నిర్ణయం తీసుకోవడానికి ఉద్యోగులకు డిసెంబర్ ఆరంభం వరకు గడువు ఇచ్చారు. అయితే, ఈ ఆఫర్‌కు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కారణం కాదని మైక్రోసాఫ్ట్ స్పష్టం చేసింది. ఏఐ రంగంలో భారీ పెట్టుబడుల కోసం నిధులను సమకూర్చుకోవడానికి, ఖర్చులను తగ్గించుకునే వ్యూహంలో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ ఏడాది ప్రారంభంలో కూడా కంపెనీ స్వచ్ఛంద పదవీ విరమణ పథకాన్ని, అంతకుముందు ఉద్యోగుల తొలగింపులను చేపట్టిన విషయం తెలిసిందే. ఏఐ వల్ల ఔషధాల ఆవిష్కరణ వేగవంతం కావడం వంటి ప్రయోజనాలు ఉన్నప్పటికీ, ప్రభుత్వాల పనితీరుకు ఇది ఒక పెద్ద పరీక్షగా నిలుస్తుందని గేట్స్ అభిప్రాయపడ్డారు.

మాజీ మిస్ స్విట్జర్లాండ్‌పై ట్రంప్ అత్యాచారం

మొదటిపేజీ తరువాయి - తనపై ట్రంప్ అత్యాచారం చేశారని ఆరోపించారు. ఈ మేరకు డెమొక్రటిక్ పార్టీ రూపొందించిన ఒక నివేదికలో ఈ ఆరోపణలను పొందుపరచడం అమెరికా రాజకీయాల్లో తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తోంది. 1993 నవంబర్‌లో ట్రంప్ తనను అసభ్యంగా తాకారని గతంలో ఆరోపించిన కీల్, ఇప్పుడు అదే ఘటనలో ఆయన తనపై అత్యాచారం కూడా చేశారని పేర్కొనడం గమనార్హం.

డెమొక్రాట్ల నివేదికలో ఏముంది?

అమెరికా హౌస్ జ్యుడీషియరీ కమిటీలోని డెమొక్రాట్లు 53 పేజీల నివేదికను విడుదల చేశారు. లైంగిక నేరాలకు పాల్పడి జైలులో ఆత్మహత్య చేసుకున్న జెఫ్రీ ఎప్‌స్టీన్‌తో ట్రంప్‌కు ఉన్న సంబంధాలపై లోతుగా దృష్టిసారించిన డెమొక్రాట్లు, ఈ నివేదికలో ట్రంప్‌పై ఉన్న పాత లైంగిక ఆరోపణలను మళ్లీ తెరపైకి తెచ్చారు. ఈ నివేదికలో భాగంగా కీల్‌తో జరిపిన ఇంటర్వ్యూల వివరాలను పొందుపరిచారు. కీల్ కథనం ప్రకారం.. 1993లో అట్లాంటిక్ సిటీలోని ట్రంప్‌కు చెందిన ప్లాజా హోటల్‌లో ఈ ఘటన జరిగింది. జెఫ్రీ ఎప్‌స్టీన్‌తో కలిసి గడిపిన తర్వాత, హోటల్ గదిలో ట్రంప్ తనపై 'క్రూరంగా' అత్యాచారం చేశారని ఆమె ఆరోపించారు. తనకు 24 ఏళ్ల వయసులో న్యూయార్క్‌లోని ప్లాజా హోటల్‌లో జరిగిన ఒక అందాల పోటీల కార్యక్రమంలో తొలిసారి ట్రంప్‌ను కలిశానని ఆమె తెలిపారు. ఆ సమయంలో తనకు వీసా ఇప్పిస్తానని, న్యూయార్క్ యూనివర్సిటీలో సీటు కూడా చూస్తానని ట్రంప్ హామీ ఇచ్చారని, "నిన్ను నేను చూసుకుంటా" అని చెప్పారని కీల్ పేర్కొన్నారు. అనంతరం ట్రంప్ పక్కకు వెళ్లిన వెంటనే జెఫ్రీ ఎప్‌స్టీన్ తన వద్దకు వచ్చి, తాను ట్రంప్‌కు బెస్ట్ ఫ్రెండ్‌నని పరిచయం చేసుకుని పార్టీకి ఆహ్వానించాడని ఆమె తెలిపారు. ఆ తర్వాత, ట్రంప్‌ను కలవడానికి తనను పై అంతస్తుకు పిలిచారని, గదిలోకి ప్రవేశించిన వెంటనే ట్రంప్ వెనుక నుంచి పట్టుకుని, బలవంతంగా అత్యాచారం చేశారని నివేదికలో పేర్కొన్నారు. ఈ దాడిలో తన దుస్తులు చిరిగిపోయాయని, శరీరంపై పలుచోట్ల గాయాలై రక్తస్రావం కూడా జరిగిందని ఆమె వివరించారు. అత్యాచారం తర్వాత ట్రంప్ తనను మంచంపై కూర్చోబెట్టి, వీసా, యూనివర్సిటీ అడ్మిషన్ హామీలను పునరావృతం చేస్తూ, ఈ విషయం ఎవరికీ చెప్పవద్దని, "షో కొనసాగాలి" అని అన్నారని కీల్ ఆరోపించారు.



డెమొక్రాట్ల డిమాండ్.. వైట్‌హౌస్ ఖండన

ట్రంప్ ప్రవర్తనా సరళికి కీల్ ఆరోపణలు అద్దం పడుతున్నాయని డెమొక్రాట్లు అంటున్నారు. అటార్నీ జనరల్ టాడ్ బ్లాంచ్ ఈ కేసులో ట్రంప్‌ను రక్షించే ప్రయత్నం చేస్తున్నారని, అందుకే ట్రంప్-ఎప్‌స్టీన్ సంబంధాలపై స్వతంత్ర ప్రత్యేక న్యాయవాదిని నియమించి దర్యాప్తు జరిపించాలని హౌస్ జ్యుడీషియరీ కమిటీ డెమొక్రాట్ ప్రతినిధి జేమీ రాస్కిన్ డిమాండ్ చేశారు. అయితే, ఈ ఆరోపణలను వైట్‌హౌస్ తీవ్రంగా ఖండించింది. ఇది పూర్తిగా రాజకీయ ప్రేరేపితమని, నవంబర్ 3న జరగనున్న కాంగ్రెస్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని డెమొక్రాట్లు చేస్తున్న అసత్య ప్రచారమని రిపబ్లికన్ పార్టీ అధికార ప్రతినిధి ఒకరు విమర్శించారు. అధ్యక్షుడు ట్రంప్ చారిత్రక విజయాలతో రిపబ్లికన్లకు పెరుగుతున్న ఆదరణను దెబ్బతీసేందుకే ఈ నిరాధార ఆరోపణలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఈ ఎన్నికల నేపథ్యంలో డెమొక్రాట్లు ఎప్‌స్టీన్‌కు సంబంధించిన ప్రకటనల కోసం ఇప్పటికే 35 మిలియన్ డాలర్లకు పైగా ఖర్చు చేసినట్లు తెలుస్తోంది.

తెలంగాణలో 'ఏఐ సాక్షమ్' కార్యక్రమం ప్రారంభం

మొదటిపేజీ తరువాయి - వేగవంతం, పారదర్శకం చేసే లక్ష్యంతో ప్రభుత్వం 'ఏఐ సాక్షమ్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ ఉద్యోగుల సామర్థ్యాన్ని పెంచేందుకు ఉద్దేశించిన ఈ కార్యక్రమాన్ని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క హైదరాబాద్‌లో ప్రారంభించారు. ప్రజల జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావడమే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వినియోగం యొక్క ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలో జరిగిన ఈ కార్యక్రమంలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ... ప్రభుత్వ కార్యాలయాల్లో పనుల వేగం పెంచి, ప్రజల సమస్యలను సకాలంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రైతులు, పింఛనుదారులు వంటి వారు పదేపదే ఆఫీసుల చుట్టూ తిరిగే దుస్థితికి చరమగీతం పాడాలన్నారు. ప్రభుత్వ నిధుల వినియోగం, సంక్షేమ పథకాలు అర్హులకు చేరుతున్నాయా లేదా అనే విశ్లేషణ, విద్యుత్ డిమాండ్ అంచనా వంటి పనులకు ఏఐ ఎంతగానో తోడ్పడుతుందని వివరించారు. అదే సమయంలో ఏఐ వినియోగంలో పలు జాగ్రత్తలు తప్పనిసరి అని భట్టి నొక్కిచెప్పారు. ఏఐ అందించిన సమాచారాన్ని అధికారులు కచ్చితంగా ధ్రువీకరించుకోవాలని సూచించారు. ప్రజల వ్యక్తిగత డేటా భద్రతకు అత్యంత ప్రాధాన్యమిస్తామని, ఏఐ నిర్ణయాలపై మానవ పర్యవేక్షణ తప్పనిసరి అని స్పష్టం చేశారు. చిన్నస్థాయి ప్రయోగాలు విజయవంతమైన తర్వాతే ఏఐ వ్యవస్థలను విస్తరించాలని, ఏవైనా లోపాలు జరిగితే బాధ్యత ఎవరిదనే దానిపై స్పష్టత ఉండాలని అన్నారు. ప్రజలకు అందే వేగవంతమైన, పారదర్శక సేవలే ఏఐ విజయానికి గీటురాయి అవుతాయని ఆయన పేర్కొన్నారు.

రాష్ట్రంలో ఎమర్జెన్సీ పాలన నడుస్తోంది

మూసీ నది ప్రాజెక్టుపై ప్రజాభిప్రాయ సేకరణకు హాజరుకాకుండా బీఆర్ఎస్ నేతలను గృహనిర్బంధం చేశారని ఆ పార్టీ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎమర్జెన్సీ తరహా పాలన సాగిస్తూ, ప్రతిపక్షాల గొంతు నొక్కుతోందని ఆయన తీవ్రస్థాయిలో విమర్శించారు. హైదరాబాద్‌లోని వాలంతరిలో మూసీ ప్రాజెక్టుపై ప్రజాభిప్రాయ సేకరణ జరగాల్సి ఉంది. ఈ కార్యక్రమానికి హాజరుకావడానికి సిద్ధమైన మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఆమె కుమారుడు కార్తీక్ రెడ్డిలను పోలీసులు శ్రీనగర్ కాలనీలోని వారి నివాసంలో గృహ నిర్బంధం చేశారు. తెల్లవారుజాము నుంచే వారి ఇంటి వద్ద భారీగా పోలీసులు మోహరించి, బయటకు రాకుండా అడ్డుకున్నారు. ఈ ఘటనపై హరీశ్ రావు ఎక్స్ వేదికగా స్పందించారు. "కరవుతో రైతులు అల్లాడుతుంటే ఆదుకోవడం చేతకాని ప్రభుత్వం, రూ. 1.50 లక్షల కోట్లతో మూసీ ప్రక్షాళన పేరుతో కమిషన్ల కోసం ప్రాజెక్టులు చేపడుతోంది" అని ఆరోపించారు. పోలీసులను అడ్డం పెట్టుకుని ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటూ, ప్రతిపక్షాల గొంతును ఎంతకాలం అణచివేస్తారని ప్రశ్నించారు. మూసీ ప్రక్షాళన ముసుగులో జరుగుతున్న దోపిడీ యత్నాలను తెలంగాణ సమాజం తిప్పికొడుతుందని, కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెబుతుందని హెచ్చరించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి కూడా అరెస్టులను ఖండించారు. ఇది అప్రజాస్వామిక చర్య అని, మూసీ పరీవాహక ప్రాంత ప్రజలకు అండగా నిలుస్తున్నందుకే తమను అక్రమంగా నిర్బంధించారని ఆరోపించారు. గృహనిర్బంధంలో ఉన్న బీఆర్ఎస్ నేతలను తక్షణమే విడుదల చేయాలని పార్టీ తరఫున డిమాండ్ చేశారు.

కేటీఆర్ పాస్‌పోర్ట్ వివాదం.. యథాతథ స్థితి కొనసాగించాలన్న హైకోర్టు

మొదటిపేజీ తరువాయి - ఆయన పాస్‌పోర్ట్‌కు సంబంధించి జారీ అయిన నోటీసుల విషయంలో యథాతథ స్థితి (స్టేటస్ కో) కొనసాగించాలని న్యాయస్థానం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఫార్ములా ఈ కేసులో విచారణ జరుపుతున్న అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ), కేటీఆర్ పాస్‌పోర్ట్‌ను స్వాధీనం చేసుకోవాలని కోరుతూ ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయానికి (ఆర్‌పీవో) లేఖ రాసింది. ఏసీబీ అభ్యర్థన మేరకు పాస్‌పోర్ట్ అధికారులు కేటీఆర్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ నోటీసులను సవాలు చేస్తూ కేటీఆర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం, పాస్‌పోర్ట్ నోటీసుల ప్రక్రియలో యథాతథ స్థితిని పాటించాలని ఆదేశించింది. ప్రతివాదులుగా ఉన్న ఏసీబీ, పాస్‌పోర్ట్ అధికారులకు నోటీసులు జారీ చేస్తూ, వారి వాదనలను కౌంటర్ అఫిడవిట్ రూపంలో సమర్పించాలని సూచించింది. అనంతరం, కేసు తదుపరి విచారణను నవంబర్ 6వ తేదీకి వాయిదా వేసింది. హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులతో కేటీఆర్ పాస్‌పోర్ట్‌ను స్వాధీనం చేసుకునే ప్రక్రియకు ప్రస్తుతానికి అడ్డుకట్ట పడినట్లయింది.

నిప్పులాంటి నిజాల ప్రతిబింబం
నిలువుటద్దం
గురువారం 29-10-2026

వైద్య సేవలకు కొత్త చిరునామా ప్రజారోగ్యానికి భరోసా!

శేరి సతీష్ రెడ్డి చేతుల మీదుగా ఆర్లియా క్లినిక్ అండ్ ఫార్మసీ ప్రారంభం

కూకట్‌పల్లి, అక్టోబర్ 28 (నిలువుటద్దం ప్రతినిధి) ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు చేరువ చేయడమే లక్ష్యంగా కూకట్‌పల్లి పరిధిలో మరో వైద్య కేంద్రం అందుబాటులోకి వచ్చింది. కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి చేతుల మీదుగా కేపీహెచ్‌బీ కాలనీలోని టెంపుల్ బస్ స్టాప్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్లియా క్లినిక్ అండ్ ఫార్మసీ ఘనంగా ప్రారంభమైంది. డాక్టర్ రాంబాబు ఆహ్వానం మేరకు జరిగిన ఈ ప్రారంభోత్సవ కార్యక్రమం సందడిగా సాగింది. ప్రజల ఆరోగ్యమే ప్రథమం.. నాణ్యమైన వైద్యమే ప్రధానం! ఈ సందర్భంగా శేరి సతీష్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజలకు అందుబాటులో నాణ్యమైన వైద్య సేవలు అందించడం నేటి సమాజంలో ఎంతో అవసరమని పేర్కొన్నారు. వైద్య రంగంలో సేవా దృక్పథంతో ముందుకు వస్తూ, ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు అందించేందుకు కృషి చేయడం అభినందనీయమని అన్నారు. ఆర్లియా క్లినిక్ అండ్ ఫార్మసీ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తూ, ప్రజల నమ్మకాన్ని చూరగొని మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాంబాబుకు ప్రత్యేక అభినందనలు తెలియజేస్తూ, క్లినిక్ విజయవంతంగా కొనసాగాలని శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ నాయకుల సందడి.. నూతన క్లినిక్‌కు శుభాకాంక్షల వెల్లువ! ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కూకట్‌పల్లి నియోజకవర్గ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కోఆర్డినేటర్ మేకల మైకేల్, ఉమ్మడి కేపీహెచ్‌బీ డివిజన్ మాజీ అధ్యక్షులు తమ్మినేని ప్రవీణ్, కొమ్ము బాబు, శ్రీధర్ చారి, గిరి నాయుడు, యూత్ కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షులు కళ్యాణ్, వసంతనగర్ డివిజన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు దుర్గా, నాగబాబు తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, మిత్రులు పాల్గొని డాక్టర్ రాంబాబుకు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజారోగ్యమే లక్ష్యంగా.. దప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తూ, విశ్వసనీయ వైద్య కేంద్రంగా గుర్తింపు పొందాలని పలువురు ఆకాంక్షించారు.

జర్నలిస్టుల హక్కుల పరిరక్షణే ఐఎఫ్‌డబ్ల్యూజే లక్ష్యం

సూరారంలో ఘనంగా ఐఎఫ్‌డబ్ల్యూజే 76వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేసిన కూకట్‌పల్లి టిడబ్ల్యూజేఎఫ్ అధ్యక్షుడు ఎర్ర యాకయ్య

కూకట్‌పల్లి, అక్టోబర్ 28 (నిలువుటద్దం ప్రతినిధి) జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, ఉద్యోగ భద్రత, మెరుగైన పని పరిస్థితుల సాధనే లక్ష్యంగా ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఐఎఫ్‌డబ్ల్యూజే) నిరంతరం కృషి చేస్తోందని కూకట్‌పల్లి టిడబ్ల్యూజేఎఫ్ అధ్యక్షుడు ఎర్ర యాకయ్య పేర్కొన్నారు. ఐఎఫ్‌డబ్ల్యూజే 76వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని సూరారం అంబేద్కర్ భవన్‌లో నిర్వహించిన వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం సీనియర్ జర్నలిస్టులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ఐఎఫ్‌డబ్ల్యూజే రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్, కూకట్‌పల్లి టిడబ్ల్యూజేఎఫ్ అధ్యక్షుడు ఎర్ర యాకయ్య, ప్రధాన కార్యదర్శి నాగుల అంజిబాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎర్ర యాకయ్య మాట్లాడుతూ.. 1950 అక్టోబర్ 28న న్యూఢిల్లీలో స్థాపించబడిన ఐఎఫ్‌డబ్ల్యూజే స్వతంత్ర భారతదేశంలో మీడియా ఉద్యోగుల కోసం ఏర్పాటైన తొలి ట్రేడ్ యూనియన్లలో ఒకటిగా గుర్తింపు పొందిందని తెలిపారు. దేశవ్యాప్తంగా జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, వేతన సవరణలు, ఉద్యోగ భద్రత, మెరుగైన పని పరిస్థితుల కోసం ఈ సంస్థ ఎన్నో ఉద్యమాలు నిర్వహించిందని వివరించారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 35 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో 30 వేలకు పైగా ప్రాథమిక, అనుబంధ సభ్యులతో ఐఎఫ్‌డబ్ల్యూజే కొనసాగుతోందని పేర్కొన్నారు. ఎలక్ట్రానిక్ మీడియా, వార్తా సంస్థలు, వివిధ భాషలకు చెందిన పత్రికల్లో పనిచేస్తున్న జర్నలిస్టులకు ఈ సంస్థ ప్రాతినిధ్యం వహిస్తూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తోందన్నారు. జర్నలిస్టుల వృత్తిపరమైన అభివృద్ధి, సంక్షేమం కోసం సంస్థ నిరంతరం పనిచేస్తోందని, వేతన బోర్డులు, ప్రెస్ కౌన్సిల్, అక్రిడిటేషన్

కమిటీలు, మీడియా సంప్రదింపుల కమిటీల్లో జర్నలిస్టుల తరఫున ప్రాతినిధ్యం వహిస్తూ కీలక పాత్ర పోషించిందని తెలిపారు. గత ఏడు దశాబ్దాలకుపైగా జర్నలిస్టుల హక్కుల సాధన కోసం సాగించిన దదోహదపడ్డాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్-- కార్యవర్గ సభ్యులు సుజాత, ఉజ్వల రెడ్డి, శివ, విష్ణుమూర్తి, పి. సురేష్, రాజ్ కుమార్ యాదవ్‌తో పాటు పలువురు జర్నలిస్టులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

బాలానగర్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన డీసీపీ రీతిరాజ్

రికార్డుల నిర్వహణ, ఏఐ రక్షక్ వినియోగంపై సమీక్ష

బాలానగర్, నిలువుటద్దం ప్రతినిధి కూకట్‌పల్లి డీసీపీ రీతిరాజ్ ఐపీఎస్, బాలానగర్ ఏసీపీ నరేష్ రెడ్డితో కలిసి బాలానగర్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని రికార్డులు, ఏఐ రక్షక్ వినియోగం, పెండింగ్ కేసులు, నోటీసులు, కోర్టు సమన్లు, వారెంట్లకు సంబంధించిన అంశాలను క్షుణ్ణంగా సమీక్షించారు. పెండింగ్ కేసుల సంఖ్యను తగ్గించేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని డీసీపీ సూచించారు. కేసులకు సంబంధించిన పత్రాలను సీసీటీఎన్ఎస్ (జజుచీూ)లో ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. కేసుల దర్యాప్తులో వేగం పెంచడంతో పాటు రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించకూడదని సూచించారు. పోలీస్ స్టేషన్ నిర్వహణ, విధుల నిర్వహణ తీరుపై డీసీపీ రీతిరాజ్ సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఈ నెలలో పదవీ విరమణ చేయనున్న ఎస్ఐ హాజీ మియాను సత్కరించి, ఆయన సేవలను అభినందించారు.

ఎస్ఐఆర్‌పై కాంగ్రెస్‌ది తప్పుడు ప్రచారం

అర్హులైన ఓటర్లను తొలగిస్తే బహిరంగ చర్చకు సిద్ధం

కేంద్ర ప్రభుత్వ అభివృద్ధిని ఓర్వలేకే విమర్శలు: ఎంపీ రఘునందన్‌రావు

సంగారెడ్డి, నిలువుటద్దం ప్రతినిధి: ఎస్ఐఆర్ (ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ)పై కాంగ్రెస్ పార్టీ తప్పుడు ప్రచారం చేస్తోందని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు ఆరోపించారు. బుధవారం సంగారెడ్డి పట్టణంలోని ఓ ప్రైవేట్ బ్యాంకెట్ హాలులో నిర్వహించిన అసెంబ్లీ బీజేపీ మేధావుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఓర్వలేకే కాంగ్రెస్ నేతలు విమర్శలు చేస్తున్నారని ఆయన అన్నారు. చనిపోయిన వారి పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించడం, ఒక వ్యక్తికి ఒకేచోట ఓటు హక్కు ఉండేలా చూడటం, 18 ఏళ్లు నిండిన అర్హులందరికీ ఓటు హక్కు కల్పించడం ఎస్ఐఆర్ ముఖ్య ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. అర్హులైన ఓటర్లను తొలగించినట్లు ఆధారాలుంటే వివరాలతో బహిరంగ చర్చకు రావాలని కాంగ్రెస్ నాయకులకు ఆయన సవాల్ విసిరారు. ఓటర్ల జాబితాలో పొరపాట్లుంటే ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. నవంబర్ 1న జరిగే రాహుల్‌గాంధీ సభకు ఓట్లు తొలగించబడ్డాయని చెబుతున్న వారిని తీసుకురావాలని ఆయన అన్నారు. ఈవీఎంలపై కాంగ్రెస్ చేస్తున్న విమర్శలను ప్రస్తావిస్తూ, గతంలోనూ ఈవీఎంల ద్వారా ఎన్నికలు జరిగాయని ఆయన గుర్తుచేశారు. మరోవైపు, ముఖ్యమంత్రి చిత్తశుద్ధితో స్పందించి సింగూరు ప్రాజెక్టులో నీటిని నింపి తాగు, సాగునీటి అవసరాలపై దృష్టి సారించాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, పార్టీ అధికార ప్రతినిధి సంగప్ప, కొవ్వూరు సంగమేశ్వరరావు, వదిన మాణిక్యరావు, కాసిని వాసు, దోమల విజయకుమార్, నరేన్ దేశ్‌పాండే తదితర జిల్లా, మండల స్థాయి నాయకులు, వివిధ మోర్చాల ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థి ఉద్యమాల నుంచి జిల్లా స్థాయి బాధ్యతల వరకు

దీజేవీ మేడ్చల్--మల్కాజిగిరి అర్బన్ జిల్లా ఐటీ కన్వీనర్‌గా కొర్ర జయరామ్ నాయక్

శేరిలింగంపల్లి నిలువుటద్దం ప్రతినిధి

కూకట్‌పల్లి నిలువుటద్దం ప్రతినిధి అక్టోబర్ 28 జేఎన్‌టీయూ విద్యార్థి నాయకుడు కొర్ర జయరామ్ నాయక్‌కు భారతీయ జనతా యువ మోర్చా (దీజేవీ) మేడ్చల్--మల్కాజిగిరి అర్బన్ జిల్లా ఐటీ కన్వీనర్‌గా బాధ్యతలు అప్పగించారు. దీజేవీ రాష్ట్ర అధ్యక్షుడు కుందే గణేష్, బీజేపీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు గిరి వర్ధన్, దీజేవీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు శ్రీనాథ్ ఆయన నియామకాన్ని ప్రకటించి శు భాకాంక్షలు తెలిపారు. విద్యార్థి సమస్యలపై పోరాటం.. యువత కోసం నిరంతరం ఉద్యమం! జేఎన్‌టీయూలో ఇంజినీరింగ్ విద్యను అభ్యసిస్తున్న కొర్ర జయరామ్ నాయక్ విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం పలు ఆందోళనలు, నిరసన కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల కోసం దీజేవీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఫీజుల బకాయి--బీజేపీ లడాయి' ఉద్యమంలో పాల్గొని విద్యార్థుల పక్షాన గళమెత్తారు. అలాగే హెచ్‌సీయూ వివాదానికి సంబంధించి నిర్వహించిన 'సేవ్ హెచ్‌సీయూ' ఆందోళనతో పాటు వివిధ విద్యార్థి ఉద్యమాల్లో పాల్గొని తన చురుకుదనాన్ని చాటుకున్నారు. విద్యార్థి దశ నుంచే సంస్థాగత కార్యక్రమాల్లో చురుకైన

పాత్ర పోషిస్తూ, విద్యార్థుల సమస్యలపై పోరాడిన జయరామ్ నాయక్‌కు జిల్లా స్థాయి బాధ్యతలు అప్పగించడం ప్రాధాన్యత సంతరించుకుంది. డిజిటల్ ప్రచారంతో యువతను చేరువ చేస్తా! జిల్లా ఐటీ కన్వీనర్‌గా సోషల్ మీడియా ప్రచారాన్ని విస్తృతం చేయడం, డిజిటల్ వేదికల ద్వారా పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, యువతను పార్టీతో అనుసంధానం చేయడం వంటి అంశాలపై జయరామ్ నాయక్ దృష్టి సారించనున్నారు. బీజేపీ అనుసరిస్తున్న అంత్యోదయ సిద్ధాంతానికి అనుగుణంగా సమాజంలోని చివరి వ్యక్తికి సైతం ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. జయరామ్ నాయక్‌కు అభినందనల వెల్లువ కొర్ర జయరామ్ నాయక్‌కు జిల్లా స్థాయి బాధ్యతలు అప్పగించడంపై జేఎన్‌టీయూ పీహెచ్‌డీ స్కాలర్, దీజేవీ రాష్ట్ర నాయకులు చల్ల రామకృష్ణారెడ్డి, పితాని సందీప్ గౌడ్‌తో పాటు జేఎన్‌టీయూ విద్యార్థులు, విద్యార్థి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. నూతన బాధ్యతల్లో ఆయన మరింత సమర్థవంతంగా పనిచేసి యువతను సంఘటితం చేయాలని ఆకాంక్షిస్తూ శు భాకాంక్షలు తెలిపారు.

గంగకత్వ కాలువ ఆధునీకరణకు రూ.37 కోట్లు

11 గ్రామాలు.. 3,300 ఎకరాలకు సాగునీటి ప్రయోజనం

నవంబర్‌లో శంకుస్థాపన.. 2028 జూన్‌లో ప్రారంభానికి ప్రణాళిక

రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా పనులు చేపట్టాలి: జగ్గారెడ్డి, నిర్మల

సంగారెడ్డి, నిలువుటద్దం ప్రతినిధి: ఏడో నిజాం కాలంలో నిర్మించిన గంగకత్వ కాలువ ఆధునీకరణకు రూ.37 కోట్లు మంజూరయ్యాయి. ఈ నేపథ్యంలో సదాశివపేట మండలం సూరారం గ్రామంలోని గంగకత్వ ప్రాజెక్టును జగ్గారెడ్డి, నిర్మల పరిశీలించి సాగునీటి శాఖ అధికారులు, ఆయకట్టు రైతులతో సమీక్ష నిర్వహించారు. నవంబర్‌లో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, వివేక్ చేతుల మీదుగా పనులకు శంకుస్థాపన చేసి, 2028 జూన్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేలా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. సదాశివపేట మండలంలో సుమారు 16 కిలోమీటర్ల మేర విస్తరించిన ఈ కాలువ పరిధిలోని 11 గ్రామాల్లో 3,300 ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యమని జగ్గారెడ్డి పేర్కొన్నారు. కాలువకు అనుసంధానమైన 28 చెరువులకు సక్రమంగా నీరందేలా లైనింగ్, తూముల పునరుద్ధరణ, దెబ్బతిన్న ప్రాంతాల మరమ్మతులు, వంతెనల విస్తరణ తదితర పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. రైతుల అవసరాలకు ప్రాధాన్యమివ్వాలని, చివరి ఆయకట్టు వరకు నీరందేలా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. కాలువలో లీకేజీలు, వర్షాకాలంలో గండ్లు, పూడిక సమస్యలను రైతులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అవసరమైన పనులకు అంచనాలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. వాగుపై ఏడు చోట్ల చెక్‌డ్యామ్‌ల నిర్మాణం, ప్రాజెక్టులో పూడిక తొలగింపు ప్రతిపాదనలను కూడా పరిశీలించాలని సూచించారు. రెండేళ్లుగా కాలువ ఆధునీకరణ కోసం ప్రయత్నించానని, నిధులు మంజూరు చేసిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పర్యటన సందర్భంగా జగ్గారెడ్డి గంగకత్వ కాలువలోకి దూకి ఈత కొట్టారు. డిసెంబర్‌లో మరోసారి ప్రాజెక్టును సందర్శించి పనుల పురోగతిని సమీక్షిస్తానని వెల్లడించారు.

పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పంటలు ఎండిన పరిస్థితి లేదు

కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతులకు తీవ్ర ఇబ్బందులు.

ఎమ్మెల్యే చింత ప్రభాకర్.

సంగారెడ్డి, నిలువుటద్దం ప్రతినిధి : కొండాపూర్ మండలంలో ఎండిన వరి పంటలను పరిశీలించిన ఎమ్మెల్యే.. విద్యుత్ అధికారితో ఫోన్‌లో మాట్లాడి సమస్య పరిష్కారానికి ఆదేశాలు ఇవ్వాలని కోరారు కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. కొండాపూర్ మండలంలో పర్యటించిన ఆయన ఎండిపోయిన వరి పంటలను పరిశీలించి, రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు తమ కష్టాలను ఎమ్మెల్యేకు వివరిస్తూ ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పాలనలో రైతులకు ఇలాంటి కష్టాలు లేవు పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఏ ఒక్కరోజు కూడా పంటలు ఎండిపోయే పరిస్థితి రాలేదని ఓ రైతు ఎమ్మెల్యే చింత ప్రభాకర్‌కు చెబుతూ వాపోయారు. తమ జీవితంలో ఇలాంటి ఇబ్బందులు ఎప్పుడూ చూడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పాలనలో ఒక్క గంట కూడా కరెంట్ పోని పరిస్థితి ఉండేదని గుర్తుచేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని రైతులు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. విద్యుత్ అధికారికి ఫోన్ చేసిన ఎమ్మెల్యే వరి పంటలు ఎండిపోతున్నా విద్యుత్ అధికారులు పట్టించుకోవడం లేదని, సమస్యను వివరించినప్పటికీ నిర్లక్ష్యంగా సమాధానాలు ఇస్తున్నారని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్ వెంటనే జిల్లా విద్యుత్ అధికారికి ఫోన్ చేసి మాట్లాడారు. రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను వివరించి, పంటలు ఎండిపోకుండా తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని తెలియజేశారు. ముందస్తు ప్రణాళిక లేకపోవడంతోనే రైతులకు కష్టాలు కాంగ్రెస్ ప్రభుత్వానికి ముందస్తు ప్రణాళిక లేకపోవడం వల్లే రాష్ట్రంలో తాగునీరు, సాగునీటి సమస్యలు తలెత్తుతున్నాయని ఎమ్మెల్యే విమర్శించారు. రైతులు ఇన్ని ఇబ్బందులు పడుతుంటే, వారి సమస్యలపై దృష్టి సారించి పరిష్కార మార్గాలు అన్వేషించాల్సిన మంత్రులు అందుకు బదులుగా గొప్పలు చెప్పుకోవడం సరికాదని అన్నారు. రైతుల కష్టాలను పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం, వారి సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు అండగా ఉంటాం.. భరోసా ఇచ్చిన ఎమ్మెల్యే పంటలు ఎండిపోతూ తీవ్రంగా నష్టపోతున్న రైతులు ఆందోళన

చెందాల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ భరోసా ఇచ్చారు. రైతులకు అండగా నిలబడి, వారి సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. రైతుల కష్టాలను ప్రభుత్వం గుర్తించి, విద్యుత్ సరఫరా సమస్యలను పరిష్కరించి, పంటలను కాపాడేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. రైతులు పండించిన పంట చేతికొచ్చే సమయంలో విద్యుత్ సమస్యల కారణంగా నష్టపోవడం బాధాకరమని, అన్నదాతలకు ఇబ్బందులు కలగకుండా సంబంధిత అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని ఎమ్మెల్యే సూచించారు.

సంగారెడ్డి కోర్ట్ ఐలు నూతన కార్యవర్గం ఎన్నిక

సంగారెడ్డి - నిలువుటద్దం ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని కోర్టు నూతన ఐలు కార్యవర్గాన్ని ఈ రోజు ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి మెదక్ జిల్లా కార్యదర్శి ఆర్. శ్రీనివాస్ హాజరయ్యారు. సంగారెడ్డి కోర్ట్ అధ్యక్షులుగా కె. నాగ భాస్కర్, ఉపాధ్యక్షులుగా ఎల్. దేవదాస్ నాయక్, వినీలా రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా లాడే ఉదయ్, సహాయ కార్యదర్శిగా భూపాల్ రెడ్డి, మల్లేశం, కోశాధికారిగా బి. లక్ష్మి, స్పోర్ట్స్ సెక్రటరీగా కే. సుభాష్ చంద్ర, ఉమెన్ ఆర్గనైజర్ కె. అరుణ కుమారి, పబ్లిక్ రిలేషన్ గా టి. ప్రభాకర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ గా టి. రత్నాకర్, ఆర్. వెంకటేశం, కమిటీ సభ్యులుగా సదానందం, జి. సుధాకర్ గౌడ్, సురేష్ కుమార్, చందర్ నాయక్, కే.సుమిత్ర, డి. సాయి శ్రీ, నాగిశెట్టి, చిరంజీవి, సురేష్, దత్తాత్రి, మొహమ్మద్ రహీముద్దీన్, దామోదర్, బస్వరాజ్, సింధుజ లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులు కే. నాగ భాస్కర్, లాడే ఉదయ్ మాట్లాడుతూ న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఐలు సంఘం ఆధ్వర్యంలో కృషి చేస్తామని తెలిపారు.

ఎస్ కే యం పి యం గవర్నమెంట్ వోకేషనల్ జూనియర్ కళాశాల కుత్బుల్లాపూర్, మేడ్చల్ మల్కాజ్గిరి డిస్ట్రిక్ట్ లో ఈరోజు ఇండియన్

రెడ్ క్రాస్ తెలంగాణ హైదరాబాద్ జిల్లా చైర్మన్ ఏవి రావు గారు, ట్రెజరర్ నరసింహారెడ్డి గారు, కోటి ధర్మ తేజ గారు, రామకృష్ణ మరియు రవికుమార్ ఆధ్వర్యంలో వెలుగు ఎడ్యుకేషన్ ట్రస్ట్ వ్యవస్థాపకులు నారాయణరావు గారు, మాదకద్రవ్యాల వ్యతిరేక నినాదాలు, మాదకద్రవ్యాల రహిత సమాజం మన అందరి బాధ్యత. మత్తు పదార్థాలకు దూరం, విజయానికి మార్గము, డ్రగ్స్ కి బానిస కావొద్దు. మీ జీవితాన్ని నాశనం చేసుకోవద్దు. డ్రగ్స్ ని వదిలివేయండి మీ కళలను నిజం చేసుకోండి ,అని ప్రతిజ్ఞ చేపించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మైమున్ గారు విద్యార్థిని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థి దశ అనేది జీవితానికి పునాది వేసుకునే బంగారు మార్గం, మీ జీవితంలో ఎప్పుడు అయినా, ఎవరు డ్రగ్స్ తీసుకోమని ప్రోత్సహిస్తే, ధైర్యంగా నో అని చెప్పండి. చెడు స్నేహాలకు దూరం ఉండండి, మంచి స్నేహితులను ఎంచుకోండి. మన కళాశాల విద్యార్థులుగా మన అందరికీ ఒక బాధ్యత ఉంది.మత్తు పదార్థాలకు దూరంగా ఉండడమే కాకుండా, ఇతరులకు అవగాహన కల్పించాలి .మన కళాశాలను మన సమాజాన్ని మాదక ద్రవ్యాల రహితంగా మార్చడానికి కృషి చేయాలి.ఈ కార్యక్రమంలో వెలుగు ఎడ్యుకేషన్ ట్రస్ట్ వ్యవస్థాపకులు నారాయణరావు గారు కళాశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.

విద్యార్థినులకు పోక్సో చట్టంపై అవగాహన

మూసాపేట: తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ ఎం. వెంకటేశ్వరరావు ఆదేశాల మేరకు, కూకట్‌పల్లి మూడవ అదనపు జిల్లా న్యాయమూర్తి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ పాఠశాల బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మూసాపేట జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 'సురక్షిత్ బచ్పన్ అభియాన్'లో భాగంగా పోక్సో చట్టం--2012పై అవగాహన కల్పించారు. బాలికల భద్రత, నమ్మకం, లైంగిక నేరాల నుంచి రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు

జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ హైదరాబాద్ JNTUH

కర్ణాటకలోని మంగళూరు విశ్వవిద్యాలయంలో నవంబర్ 7వ తేదీన జరగనున్న అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనే తన 10 కిలోమీటర్ల పురుషుల క్రాస్-కంట్రీ జట్టు కోసం ఎంపికలను నిర్వహించింది. అలాగే, హైదరాబాద్‌లోని వోక్సెన్ విశ్వవిద్యాలయంలో నవంబర్ 9 నుండి 12 వరకు జరగనున్న సౌత్ జోన్ అంతర్ విశ్వవిద్యాలయ ఛాంపియన్‌షిప్‌లో చెస్ జట్టు ఎంపికలలో 35 మంది పాల్గొన్నారు. ఛాంపియన్‌షిప్ ఈవెంట్లలో విశ్వవిద్యాలయానికి ప్రాతినిధ్యం వహించడానికి ఒక్కో ఈవెంట్ నుండి ఆరుగురు సభ్యులను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ కళాశాలల నుండి ఫిజికల్ డైరెక్టర్లు కూడా పాల్గొన్నారు. ప్రతి ఛాంపియన్‌షిప్ ఈవెంట్‌కు ఆరుగురు సభ్యులను ఎంపిక చేశారు. గౌరవనీయులైన ఉపకులపతి డాక్టర్ టి. కిషన్ కుమార్ రెడ్డి, రెక్టర్ డాక్టర్ ఎ. దామోదరం మరియు రిజిస్ట్రార్ డాక్టర్ ఎ. జయ లక్ష్మి క్రీడాకారులకు, మహిళా జట్టుకు తమ శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఛాంపియన్‌షిప్‌లలో తమ ప్రతిభను ప్రదర్శించాలని వారిని ప్రోత్సహించారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరం

ముత్తంగి, ఇంద్రేశం గురుకులాల్లో న్యాయ అవగాహన కార్యక్రమాలు

ఉచిత న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలి: సీనియర్ సివిల్ జడ్జి బి. సౌజన్య

పటాన్‌చెరు, నిలువుటద్దం ప్రతినిధి,అక్టోబర్ 28 : విద్యార్థులు చిన్న వయస్సు నుంచే చట్టాలపై అవగాహన పెంపొందించుకొని బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని సంగారెడ్డి జిల్లా సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. సౌజన్య సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ముత్తంగి, ఇంద్రేశంలోని మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యా సంస్థల్లో నిర్వహించిన న్యాయ అవగాహన కార్యక్రమాల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరికీ న్యాయం అందుబాటులో ఉండేలా సంస్థ అందిస్తున్న ఉచిత న్యాయ సేవలు, పౌరుల హక్కులు, చట్టాల ప్రాధాన్యాన్ని వివరించారు. హైకోర్టు న్యాయవాది డాక్టర్ ఐలాపూర్ మాణిక్ యాదవ్ మాట్లాడుతూ మహిళల రక్షణ చట్టాలు, పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం, బాలల హక్కులు, అంతర్జాల నేరాల నివారణ, రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఆర్థిక ఇబ్బందులతో ఎవరూ న్యాయానికి దూరం కాకూడదని, అర్హులు ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ ఉపపరిశీలకురాలు సునీత, కళాశాలల ప్రధానాచార్యులు, సంబంధిత అధికారులు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్రతినిధులు, సహాయ ఉపపరిశీలకులు కటకం శివ తదితరులు పాల్గొన్నారు.

నిష్పక్షపాత నిజాల ప్రతిబింబం
నిలువుటద్దం
గురువారం 29-10-2026

కాలనీల అభివృద్ధికి గాంధీ పెద్దపీట

రూ.1.18 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం

ఆల్విన్ కాలనీ డివిజన్‌లో ఆరు ప్రాంతాల్లో రోడ్ల పనులకు శంకుస్థాపన

నాణ్యతలో రాజీ వద్దు.. పనులు త్వరగా పూర్తి చేయాలి: పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ.

శేరిలింగంపల్లి, నిలువుటద్దం ప్రతినిధి: శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ తెలిపారు. ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఆరు ప్రాంతాల్లో రూ.1 కోటి 18 లక్షల 80 వేల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు తాజా మాజీ కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్ గౌడ్, నార్నె శ్రీనివాసరావుతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ.. తులసి నగర్, ఆల్విన్ ఫేజ్-1, భూదేవి హిల్స్, గోవింద్ హోటల్ చౌరస్తా, ఛత్రపతి శివాజీ నగర్, మహంకాళి నగర్, ఇందిరా నగర్ ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. రోడ్ల సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న కాలనీవాసులకు ఈ పనులతో ఉపశమనం లభిస్తుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో, మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని తెలిపారు. కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమిస్తూ రహదారుల అభివృద్ధిని వేగవంతం చేస్తామని గాంధీ పేర్కొన్నారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, ఎక్కడా రాజీ పడకూడదని అధికారులకు సూచించారు. పనుల్లో జాప్యం జరగకుండా నిర్ణీత సమయంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడం, ట్రాఫిక్ సమస్యలను తగ్గించడం, సురక్షితమైన ప్రయాణానికి అవసరమైన వసతులు కల్పించడం తమ లక్ష్యమని తెలిపారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పునరుద్ఘాటించారు. రూ.1.18 కోట్లతో చేపట్టనున్న లక్షలు.భూదేవి హిల్స్ కాలనీ: రూ.20 లక్షలు. గోవింద్ హోటల్ చౌరస్తా: రూ.38.80 లక్షలు. ఛత్రపతి శివాజీ నగర్ కాలనీ: రూ.15 లక్షలు. మహంకాళి నగర్ కాలనీ: రూ.10 లక్షలు. ఇందిరా నగర్ కాలనీ: రూ.23 లక్షలు. ఈ ఆరు ప్రాంతాల్లో మొత్తం రూ.1,18,80,000 అంచనా వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, కాలనీల అసోసియేషన్ సభ్యులు, మహిళలు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జలవాయు విహార్‌కు అభివృద్ధి బాటలు

రూ.1.33 కోట్లతో సీసీ రోడ్లు, రోడ్డు విభాజిని, రిటైనింగ్ వాల్ నిర్మాణం

పనులకు శంకుస్థాపన చేసిన పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ

శేరిలింగంపల్లి, నిలువుటద్దం ప్రతినిధి

శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమిస్తూ హైదర్‌నగర్ డివిజన్‌లోని జలవాయు విహార్ కాలనీలో రూ.1 కోటి 33 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ నిధులతో నూతన సీసీ రోడ్లు, రోడ్డు విభాజిని, రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు చేపట్టనున్నారు. ఈ పనులు పూర్తయితే కాలనీవాసులకు మెరుగైన రవాణా సౌకర్యం కలగడంతో పాటు రోడ్ల సమస్యలకు ఉపశమనం లభించనుంది. ఈ సందర్భంగా ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, కాలనీల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో, మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తూ, ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందించడమే తమ లక్ష్యమని చెప్పారు. అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని, ఎక్కడా నాణ్యత విషయంలో రాజీ పడకూడదని అధికారులకు సూచించారు. పనుల్లో జాప్యం లేకుండా నిర్ణీత సమయంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గించి, సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణానికి అవసరమైన మౌలిక వసతులను కల్పించేందుకు కృషి చేస్తానని

గాంధీ తెలిపారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమిస్తానని, హైదర్‌నగర్ డివిజన్‌తో పాటు శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని పునరుద్ఘాటించారు. అభివృద్ధి పనుల వాల్ నిర్మాణం. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, కాలనీ అసోసియేషన్ సభ్యులు, మహిళలు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

భరత్‌నగర్‌లో సమస్యలపై ఎమ్మెల్యే ఆగ్రహం అధికారులకు డెడ్‌లైన్

7 నుంచి 10 రోజుల్లో రోడ్డు పనులు పూర్తి చేయాలి

తాగునీటి సమస్యకు తక్షణ పరిష్కారం చూపాలని మాధవరం కృష్ణారావు ఆదేశం

కూకట్‌పల్లి, అక్టోబర్ 28 (నిలువుటద్దం ప్రతినిధి) ఫతేనగర్ డివిజన్ (ఓల్డ్) పరిధిలోని భరత్‌నగర్ కాలనీలో నెల రోజులుగా కొనసాగుతున్న తాగునీటి సరఫరా సమస్య, అసంపూర్తిగా ఉన్న రోడ్డు పనులపై కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తక్షణమే పరిష్కరించాలని, మరో 7 నుంచి 10 రోజుల్లో రోడ్డు పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానికుల సమస్యలను తెలుసుకునేందుకు భరత్‌నగర్ కాలనీలో పర్యటించిన ఎమ్మెల్యే, ఫతేనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్, మూసాపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ తూము శ్రవణ్ కుమార్‌లతో కలిసి కాలనీలోని పరిస్థితులను పరిశీలించారు. ఈ

పర్యటనలో జలమండలి, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు. కాలనీలో వాటర్‌లైన్ పనుల కోసం చేపట్టిన తవ్వకాలు, అసంపూర్తిగా మిగిలిన రోడ్డు నిర్మాణ పనుల కారణంగా స్థానికులు, వాహనదారులు పడుతున్న ఇబ్బందులను ఎమ్మెల్యే స్వయంగా పరిశీలించారు. నెల రోజులుగా పనులు పెండింగ్‌లో ఉండటంపై అధికారులను ప్రశ్నిస్తూ, ప్రజలకు ఇబ్బందులు కలిగించేలా పనులను మధ్యలో వదిలేయడం సరికాదని స్పష్టం చేశారు. ప్రధాన రహదారిపై పనుల అసంపూర్తిగా ఉండటంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని పేర్కొన్న ఎమ్మెల్యే, ప్రజలకు సకాలంలో తాగునీరు అందించడంతో పాటు రహదారులపై ప్రయాణానికి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. పనుల విషయంలో ఇకపై నిర్లక్ష్యం సహించేది లేదని హెచ్చరిస్తూ, నిర్ణీత గడువులోగా రోడ్డు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. గడువులోగా పనులు పూర్తి చేసి రవాణా సౌకర్యాన్ని పునరుద్ధరించాలని అధికారులను సూచించారు. ఈ పర్యటనలో కాలనీ వాసులు కృష్ణారెడ్డి, విజయ్ కుమార్, పవన్ రెడ్డి, శాంభశివ రెడ్డి, వీణ, ఉమాపతి గౌడ్, శారద, జ్యోతి గౌడ్, హరిత తదితరులు పాల్గొన్నారు.

భరత్‌నగర్ సమస్యలపై ఎమ్మెల్యే ఆగ్రహం అధికారులకు డెడ్‌లైన్

7 నుంచి 10 రోజుల్లో రోడ్డు పనులు పూర్తి చేయాలి తాగునీటి సమస్యకు తక్షణ పరిష్కారం చూపాలి: మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి, అక్టోబర్ 28 (నిలువుటద్దం ప్రతినిధి) భరత్‌నగర్ కాలనీలో ప్రజా సమస్యలపై ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. నెల రోజులుగా కొనసాగుతున్న తాగునీటి సరఫరా సమస్యను వెంటనే పరిష్కరించాలని, అసంపూర్తిగా ఉన్న రోడ్డు పనులను మరో 7 నుంచి 10 రోజుల్లో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఫతేనగర్ డివిజన్ (ఓల్డ్) పరిధిలోని భరత్‌నగర్ కాలనీలో స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పర్యటించారు. ఈ సందర్భంగా ఫతేనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్, మూసాపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ తూము శ్రవణ్ కుమార్‌తో కలిసి కాలనీలోని పరిస్థితులను పరిశీలించారు. ఈ పర్యటనలో జలమండలి, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు. కాలనీలో వాటర్‌లైన్ పనుల కోసం చేపట్టిన తవ్వకాలు, అసంపూర్తిగా మిగిలిన రోడ్డు నిర్మాణ పనుల కారణంగా స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే గుర్తించారు. నెల రోజులుగా పనులు పెండింగ్‌లో ఉండటంపై అధికారులను ప్రశ్నించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగేలా పనులను మధ్యలో వదిలేయడం సరికాదని స్పష్టం చేశారు. ప్రధాన రహదారిపై పనులు అసంపూర్తిగా ఉండటంతో రాకపోకలకు

అంతరాయం కలుగుతోందని పేర్కొంటూ, తాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. రోడ్డు పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా రవాణా సౌకర్యాన్ని పునరుద్ధరించాలని ఆదేశించారు. పనుల్లో నిర్లక్ష్యం సహించేది లేదు! నిర్ణీత గడువులోగా రోడ్డు పనులు పూర్తి చేయాలని, తాగునీటి సమస్యకు తక్షణ పరిష్కారం చూపాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఇకపై పనుల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. గడువులోగా తీసుకురావాలని తెలిపారు. ఈ పర్యటనలో కాలనీవాసులు కృష్ణారెడ్డి, విజయ్ కుమార్, పవన్ రెడ్డి, శాంభశివ రెడ్డి, వీణ, ఉమాపతి గౌడ్, శారద, జ్యోతి గౌడ్, హరిత తదితరులు పాల్గొన్నారు.

RAC అంటే ఏమిటి? రైలు ప్రయాణంలో సీటు గ్యారెంటీ ఉంటుందా?

ఎక్కువగా? పూర్తి బెర్త్ దొరుకుతుందా లేదా? అనే సందేహాలు రైల్వే అధికారులు స్పష్టతనిచ్చారు.

ఆర్ఏసీ అంటే ఏమిటి?

ఆర్ఏసీ అంటే 'రిజర్వేషన్ ఎగైనెస్ట్ క్యాన్సిలేషన్' (=వెయిటింగ్‌ఆటో...). ఒక రైలులో కన్ఫర్మ్ బెర్త్‌లన్నీ పూర్తయిన తర్వాత, పరిమిత సంఖ్యలో ప్రయాణికులకు కూర్చోవడానికి సీటు కేటాయించే పద్ధతి ఇది.

సీటు పొందే అవకాశం ఉంటుందా?

ప్రయాణికుడు తప్పకుండా రైలు ఎక్కి ప్రయాణించవచ్చు. సైడ్ లోయర్ బెర్త్ (సాధారణ సాతీవాలీ దీపేష్లు) ఒక్కదానిని ఇద్దరు ఆర్ఏసీ ప్రయాణికులకు పంచుకోవడానికి కేటాయిస్తారు. అయితే మొదటి దశలో పడుకోవడానికి పూర్తి బెర్త్ గ్యారంటీ ఉండదు. భారతీయ రైల్వేలో టికెట్ బుక్ చేసుకునేటప్పుడు ఆర్ఏసీ అనే పదం ఎదురవుతుంటుంది. అసలు ఆర్ఏసీ టికెట్ ఉన్నవారు రైలు

ఆర్ఏసీ టికెట్ కలిగిన ప్రయాణికుడు తప్పకుండా రైలు ఎక్కి ప్రయాణించవచ్చు. సైడ్ లోయర్ బెర్త్ (సాధారణ సాతీవాలీ దీపేష్లు) ఒక్కదానిని ఇద్దరు ఆర్ఏసీ ప్రయాణికులకు పంచుకోవడానికి కేటాయిస్తారు. అయితే మొదటి దశలో పడుకోవడానికి పూర్తి బెర్త్ గ్యారంటీ ఉండదు.

ఆర్ఏసీ టికెట్ కన్ఫర్మ్ అవుతుందా?

సీట్లు ఖాళీ అయ్యే దానిని బట్టి ఆర్ఏసీ టికెట్ కన్ఫర్మ్ (బెర్త్)గా మారే అవకాశం ఉంటుంది. కన్ఫర్మ్ అయిన ప్రయాణికులు ఎవరైనా టికెట్ క్యాన్సిల్ చేసుకుంటే, వారి స్థానంలో ఆర్ఏసీ ఉన్నవారి హోదా మెరుగుపడుతుంది. ఉదాహరణకు బుకింగ్ సమయంలో ఆర్ఏసీ 25 ఉంటే అది ప్రయాణ సమయానికి ఆర్ఏసీ 10, ఆర్ఏసీ 2 లేదా పూర్తిగా బెర్త్ (కన్ఫర్మ్) అయ్యే అవకాశం ఉంది. టికెట్ పూర్తిగా కన్ఫర్మ్ అయితే ప్రయాణికుడికి ఒక పూర్తి బెర్త్ కేటాయిస్తారు.

చార్ట్ సిద్ధమయ్యాక కూడా ఆర్ఏసీ ఉంటే ఏం జరుగుతుంది?

ఫైనల్ రిజర్వేషన్ చార్ట్ తయారైన తర్వాత కూడా టికెట్ ఆర్ఏసీ స్టేటస్‌లోనే ఉంటే ప్రయాణికుడు అదే టికెట్‌తో రైలులో ప్రయాణించవచ్చు. ప్రయాణంలో ఇద్దరు ప్రయాణికులు ఒకే బెర్త్‌ను కూర్చోవడానికి పంచుకోవాల్సి ఉంటుంది. అయితే చార్ట్ తయారైన తర్వాత మాత్రమే ఆర్ఏసీలో ఏ బెర్త్ అనేది తెలుస్తుంది. కన్ఫర్మ్ టికెట్ ఉన్న ప్రయాణికుడు రైలు ఎక్కకపోతే లేదా మధ్యలో దిగిపోతే, రైలులోని టీటీఈ (రైల్వే చెకింగ్ సిబ్బంది) సీనియారిటీ ఆధారంగా ఆ ఖాళీ బెర్త్‌ను ఆర్ఏసీ ప్రయాణికుడికి కేటాయిస్తారు.

క్రీడా తెలంగాణ దిశగా మహిళా కబడ్డీకి ప్రోత్సాహం

రాష్ట్రస్థాయి మహిళా కబడ్డీ పోటీల ప్రారంభోత్సవంలో కూకట్‌పల్లి కాంగ్రెస్ నాయకుడు గాదె శివ

కూకట్పల్లి నిలువుటద్దం ప్రతినిధి రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని సత్తుపల్లి నియోజకవర్గ కేంద్రంలో మువ్వా యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి మహిళా కబడ్డీ పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ నాయకుడు గాదె శివ తన మిత్రబృందంతో కలిసి హాజరయ్యారు. తెలంగాణ రాష్ట్ర ఇరిగేషన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మువ్వా విజయబాబు సమక్షంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మట్టా రాగమయి, మువ్వా విజయబాబు కేక్ కట్ చేసి రాష్ట్రస్థాయి మహిళా కబడ్డీ పోటీలను ప్రారంభించారు. అనంతరం గాదె శివ తన మిత్రబృందంతో కలిసి పోటీలను వీక్షించారు. ఈ సందర్భంగా గాదె శివ మాట్లాడుతూ మహిళలను క్రీడల్లో ప్రోత్సహించడం, యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడం అభినందనీయమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా తెలంగాణను క్రీడా తెలంగాణగా తీర్చిదిద్దేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని మహిళా క్రీడాకారులకు ప్రోత్సాహం అందించేలా రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహించడం సంతోషకరమని గాదె శివ అన్నారు. యువతకు స్ఫూర్తినిస్తూ క్రీడా కార్యక్రమాల నిర్వహణకు కృషి చేస్తున్న మువ్వా విజయబాబుకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, యువత తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

అక్టోబర్ 1 నుంచి బిగ్ చేంజెస్ మీ జేబుపై నేరుగా ప్రభావం చూపే 10 కీలక మార్పులు ఇవే!

అక్టోబర్‌లో మీకు బ్యాంకు సంబంధిత పనులు ఏమైనా ఉంటే, ఇంటి నుండి బయలుదేరే ముందు ఆర్‌బీఐ బ్యాంకు సెలవుల జాబితాను చూసుకోండి. వచ్చే నెలలో వారపు సెలవులతో కలిపి బ్యాంకులు మొత్తం 16 రోజుల పాటు మూసి..

సెప్టెంబర్ నెల ముగియబోతోంది. దేశంలో అనేక ప్రధాన మార్పులతో అక్టోబర్ నెల ప్రారంభం కానుంది వీటిలో ఎల్‌పీజీ సిలిండర్ ధరలు, బుకింగ్ నిబంధనలలో మార్పులు ఉంటాయి. అదే సమయంలో బ్యాంక్ ఏటీఎంలు, ఫిక్స్‌డ్ డిపాజిట్లకు సంబంధించిన నిబంధనలు కూడా మారతాయి. అదనంగా పండగ సీజన్‌కు ముందు టీటీలు, రిఫ్రిజిరేటర్లు, ఏసీలు మరింత ఖరీదైనవిగా మారనున్నాయి. అక్టోబర్ 1, 2026 నుండి ప్రతి ఇంటిపైనా, ప్రతి ఒక్కరి జేబుపైనా ప్రభావం చూపే అటువంటి 10 ప్రధాన మార్పుల గురించి తెలుసుకుందాం.

1. ఎల్పీజీ సిలిండర్ ధరలు:

ప్రతి నెల ఒకటో తేదీన, ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు ఎల్పీజీ సిలిండర్ ధరలను సవరించి కొత్త రేట్లను విడుదల చేస్తాయి. అక్టోబర్ 1, 2026న దేశవ్యాప్తంగా ప్రజలు దీనిని నిశితంగా గమనిస్తున్నారు. ఇటీవలి కాలంలో 19 కేజీల వాణిజ్య ఎల్పీజీ సిలిండర్ ధరలో తరచుగా మార్పులు చోటుచేసుకుంటుండగా, 14 కేజీల గృహ వినియోగ ఎల్పీజీ సిలిండర్ ధర స్థిరంగా ఉండటం గమనార్హం. ప్రస్తుతం దీని ధర ఢిల్లీలో రూ.942, కోల్‌కతాలో రూ.968, ముంబైలో రూ.941.50, చెన్నైలో రూ.957.50గా ఉంది.

2. ఎల్పీజీ సబ్సిడీ నిబంధనలు:

అక్టోబర్ 1వ తేదీ నుండి అమల్లోకి రానున్న మరో ప్రధాన మార్పు కూడా ఎల్పీజీకి సంబంధించినదే. అక్టోబర్ 1వ తేదీ నుండి సబ్సిడీతో కూడిన గృహ వినియోగ ఎల్పీజీ రీఫిల్‌లను పొందేందుకు ప్రభుత్వం ఒక కొత్త నిబంధనను అమలు చేయనుంది. ఎల్పీజీ సబ్సిడీని పొందేందుకు వినియోగదారులు ఇప్పుడు ఆధార్ బయోమెట్రిక్ ధృవీకరణ, లేదా ఇ-కేవైసీ (ఎల్పీజీ ఇకేవైసీ)ని పూర్తి చేయాల్సి ఉంటుంది. ఇప్పటికే ఈ ప్రక్రియను పూర్తి చేసిన వారు దీనిని మళ్లీ చేయవలసిన అవసరం లేదు.

3. ఓటీపీ ఆధారిత ఎల్పీజీ డెలివరీ:

వచ్చే నెల మొదటి తేదీన జరగనున్న మూడవ ప్రధాన మార్పు కూడా ఎల్పీజీ వినియోగదారులకు సంబంధించినదే. వాస్తవానికి అక్టోబర్ 1వ తేదీ నుండి ఓటీపీ ఆధారిత ఎల్పీజీ డెలివరీ సేవ ప్రారంభం కానుంది. ఓటీపీ ఆధారిత ఎల్పీజీ డెలివరీ అంటే, ఇకపై ఎల్పీజీ సిలిండర్ డెలివరీకి కేవలం బుకింగ్ రసీదు మాత్రమే కాకుండా, వినియోగదారుడి రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌కు వచ్చిన వన్-టైమ్ పాస్‌వర్డ్ (ఓటీపీ) ధృవీకరణ కూడా అవసరం అవుతుంది.

4.ఏటీఎఫ్ ధరలు మారతాయి:

ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు నెల మొదటి రోజున ఎల్పీజీ సిలిండర్ ధరను మార్చడమే కాకుండా, ఏవియేషన్ ఫ్యూయల్ లేదా ఎయిర్ టర్బైన్ ఫ్యూయల్ (ఏటీఎఫ్) ధరలను కూడా సవరించి కొత్త రేట్లను జారీ చేస్తాయి. ఇందులో ఏ మార్పు వచ్చినా అది విమాన ప్రయాణికుల జేబు ఖర్చులను పెంచుతుంది లేదా తగ్గిస్తుంది. ప్రస్తుతం ఢిల్లీలో కిలోలీటరుకు రూ.1,04,927, కోల్‌కతాలో కిలోలీటరుకు రూ. 1,09,450, ముంబైలో కిలోలీటరుకు రూ. 98,247, చెన్నైలో కిలోలీటరుకు రూ.1,09,873 చొప్పున ఏటీఎఫ్ అమ్ముడవుతోంది.

5. ఎస్‌బిఐ ఏటీఎం నిబంధనలు:

మీరు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) కస్టమర్ అయితే, అక్టోబర్ 1, 2026 నుండి అమల్లోకి వచ్చే ఐదవ మార్పు మీకే వర్తిస్తుంది. ఎస్‌బిఐ పొదుపు ఖాతాదారులు, జీతం ఖాతాదారులు ఇప్పటి నుండి ఏటీఎంల నుండి అదనపు ఛార్జీలు చెల్లించవలసి రావచ్చు. బ్యాంకు వెబ్‌సైట్ ప్రకారం, శాఖల ద్వారా తెరిచిన బేసిక్ సేవింగ్స్ బ్యాంక్ డిపాజిట్ (బీఎస్‌బీడీ) ఖాతాలు ఉన్న కస్టమర్లు, నెలకు నాలుగు ఉచిత ఉపసంహరణల తర్వాత ప్రతి ఏటీఎం ఉపసంహరణకు రూ.15, +జీఎస్‌టీ చెల్లించవలసి ఉంటుంది. అక్టోబర్ నుండి ఎస్‌బిఐ జీతం ఖాతాదారుల కోసం నిబంధనలు మారుతున్నాయి. ఈ కస్టమర్ల కోసం నెలవారీ ఉచిత లావాదేవీల పరిమితిని 10 నుండి 5గానికి, అంటే ఐదుకు తగ్గిస్తున్నారు. ఉచిత ఏటీఎం ఉపసంహరణ పరిమితిని మించిపోతే, ఆరవ లావాదేవీ నుండి రూ.23, +జీఎస్‌టీ రుసుము వర్తిస్తుంది. ఉచిత పరిమితిని చేరుకున్న తర్వాత ఆర్థికేతర లావాదేవీలపై రూ.11, జీఎస్టీ వసూలు చేయనున్నారు.

6. ఎఫ్‌డి రేట్లకు సంబంధించిన నిబంధనలు:

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) ఫిక్స్‌డ్ డిపాజిట్ల (ఎఫ్‌డి నిబంధనల మార్పు) నిబంధనలను మారుస్తోంది. ఈ మార్పులు ఎఫ్‌డి వడ్డీ రేట్లకు సంబంధించినవి. ఇవి అక్టోబర్ 1వ తేదీ నుండి అమల్లోకి వస్తాయి. కొత్త నిబంధన ప్రకారం, బ్యాంకులు ప్రతిరోజూ ఉదయం 10 గంటలలోపు ఎఫ్‌డి వడ్డీ రేట్ల వివరాలను అప్‌డేట్ చేయాల్సి ఉంటుంది. సంబంధిత ప్రతి వివరాలను వెబ్‌సైట్‌లో ప్రదర్శిస్తారు. అంతేకాకుండా, ఒకే తేదీన స్వీకరించిన ఎఫ్‌డి డిపాజిట్లపై ఏకరీతి వడ్డీ రేట్లను అందించాలని బ్యాంకులకు సూచించడం జరిగింది. ఈ విషయంలో ఎలాంటి వివక్ష ఉండకూడదు. బల్క్ డిపాజిట్లపై వేర్వేరు వడ్డీ రేట్లు లేదా రన్-ఆఫ్ రేట్లకు సంబంధించిన నిబంధన కూడా మారనుంది.

7. ఎన్నారై పెట్టుబడులు:

ఇప్పటి వరకు, ఒక ఎన్నారై నుండి ఆస్తిని కొనడానికి సాధారణ ఆస్తి లావాదేవీల కంటే కొంచెం ఎక్కువ పత్రాల పని అవసరమయ్యేది. కానీ ఈ ప్రక్రియ అక్టోబర్ 1వ తేదీ నుండి మారబోతోంది. ఎందుకంటే ఆదాయపు పన్ను శాఖ ఎన్నారై కొనుగోలుదారుల కోసం టీడీఎస్ (టాన్) ప్రక్రియను సులభతరం చేస్తోంది. అక్టోబర్ 1వ తేదీ నుండి, ఎన్నారైల నుండి స్థిరాస్తిని కొనుగోలు చేసే నివాస వ్యక్తులు మరియు హిందూ అవిభక్త కుటుంబాలు (హెచ్‌యూఎఫ్) ఇకపై విడిగా టీడీఎస్ మినహాయించి, ఫైల్ చేయాల్సిన అవసరం లేదు. దానికి బదులుగా, కొనుగోలుదారులు తమ పాన్ (శాశ్వత ఖాతా సంఖ్య) ను ఉపయోగించి టీడీఎస్‌ను మినహాయించి, జమ చేసి, నివేదించగలరు.

8. జనన, మరణ ధృవీకరణ పత్రాలు:

అక్టోబర్ 1, 2026 నుండి అమలులోకి వచ్చే తదుపరి మార్పు, జనన, మరణ నమోదుకు సంబంధించినది. ఈ ప్రక్రియలో జాప్యాన్ని గణనీయంగా కఠినతరం చేస్తున్నారు.